క్లుప్తంగా

విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి



మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ శౌరభ్‌శర్మ

సుజాతనగర్: చదువులో విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ట్రైనీ కలెక్టర్ శౌరభ్‌శర్మ అన్నారు. స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. పాఠశాల పరిసరాలు, వంట గది, విద్యార్థుల పడక గదులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులను ప్రశ్నలడిగి విద్యా ప్రమాణాలను తెలుసుకున్నారు. మాట్లాడుతూ విద్యార్థుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం, ఇల్లెందు పట్టణ పరిసర ప్రయాణికులకు శనివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కొత్తగూడెం డిపో మేనేజర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూచనలు, ఫిర్యాదులు, సలహాలకు 9959225959 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

డీజీఎం బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి బెల్లంపెల్లి రీజియన్ లా డిపార్ట్‌మెంట్ డీజీఎంగా విధులు నిర్వహిస్తున్న శిరీషరెడ్డిని హైదరాబాద్‌లోని లా డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేస్తూ కార్పొరేట్ ఈఈ సెల్ హెచ్ఓడీ మురళీధర్‌రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న జి.ప్రదీప్‌కుమార్ ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న నేపథ్యంలో శిరిషరెడ్డిని బదిలీ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల పరిశీలన

జూలూరుపాడు: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం అధికారులు పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ తాళ్లూరి రవి, ఎంఈఓ బానోత్ ఝంకీలాల్, ఎంపీఓ టి.తులసీరామ్ వినోభానగర్, భోజ్యాతండా, రేగళ్లతండా, వీరభద్రాపురం, అనంతారం, గంగారంతండా, మొద్దులగూడెం, పెద్దతండా, లైన్‌తండా, జడలచింత, బచ్చలకోయగూడెం, దండుమిట్టతండా ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. పాఠశాలల్లో తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్, ప్రస్తుత పాఠశాల స్థితిగతులను పరిశీలించిన అధికారులు వివరాలు నమోదు చేశారు.

బదిలీలు రద్దు చేయాలి

పాల్వంచ: విద్యుత్ సౌధకు ఇచ్చిన డిప్యూటేషన్ బదిలీలను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ కేటీపీఎస్ 5, 6 దశల బ్రాంచ్ కార్యదర్శి డి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కేటీపీఎస్ సీఈ ఎం.ప్రభాకర్‌రావుకు అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. సీనియారిటీ ప్రకారం మెడికల్, స్పౌజ్, పర్సనల్ ట్రాన్స్‌ఫర్స్ ఇవ్వాలని కోరారు.

బ్యాగులు, నోటుపుస్తకాల పంపిణీ

పాల్వంచరూరల్: బంధ్రుగొండ గ్రామపంచాయతీ కొయ్యగట్టు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని 45 మంది విద్యార్థులకు శుక్రవారం కొల్లి ఫౌండేషన్ వ్యవస్థాపకులు కొల్లి కల్పనా చౌదరి బ్యాగులు, నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కూల్ పక్కా భవన నిర్మాణం కోసం కృషి చేస్తామన్నారు.

మొక్కల వితరణ

సింగరేణి(కొత్తగూడెం): లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం మిలీనియం ఆధ్వర్యంలో శుక్రవారం రుద్రంపూర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు 30 కుండీల క్రోటాన్ మొక్కలను ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్‌కు వితరణగా అందజేశారు. వెంకట పుల్లయ్య, బొక్కా శ్రీనివాస్, నమిళ్ల నరేష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న దుర్గా

కొత్తగూడెంఅర్బన్: సినీనటుడు నాగార్జున పుట్టినరోజు వేడుకలను శుక్రవారం కొత్తగూడెంలో ఫ్యాన్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బూడిదగడ్డలోని సావిత్రమ్మ వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ అనంతరం అన్నదానం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు వాంకుడోత్ దుర్గా, భరత్, రాంబాబు, శివ, రాహుల్, అఖిల్, తరుణ్, అల్తాఫ్, వేణు, శ్రీమంత్ పాల్గొన్నారు.

సైజు ఉండవు.. బరువు రావు

- అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నసైజు గుడ్ల సరఫరా
- అధికారుల పర్యవేక్షణ లేక కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం





గుడ్లను తూకం చూస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



కిరాణా షాపులో గుడ్డు బరువు చూస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న సరుకుల్లో నాణ్యత లోపిస్తోంది. ప్రతీనెల కోడిగుడ్లు, కందిపప్పు, నూనె, బియ్యంతోపాటు బాలామృతాన్ని సరఫరా చేస్తారు. మండలంలో మొత్తం 234 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 991మంది గర్భిణులు, 752 మంది బాలింతలు, 0– 3 సంవత్సరాల వయస్సున్న పిల్లలు 4,324 మంది, 3– 6 సంవత్సరాల వయస్సున్న పిల్లలు 3,751 మందికి సేవలందిస్తున్నారు. కేంద్రాల వద్ద ఆహారం వండి వడ్డిస్తున్నారు. వారికి అందించే ఆహార నాణ్యతపై వారి అరోగ్యం ఆధారపడి ఉంటుంది. ఈ మేరకు సేవలు పారదర్శకంగా ఉండేందుకు ముఖగుర్తింపు చేపట్టారు.

చిన్నసైజు కోడిగుడ్ల సరఫరా

అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే కోడిగుడ్ల పరిమాణం తగ్గిందని లబ్ధిదారులు చెబుతున్నారు. వాస్తవంగా అంగన్‌వాడీ కేంద్రాలకు 50 గ్రాముల పరిమాణం కలిగిన గుడ్లను సరఫరా చేయాల్సి ఉండగా తక్కువ పరిమాణం కలిగిన, నాణ్యత లోపించిన వాటిని సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార లోపాన్ని అధికమించేందుకు చర్యలు తీసుకుంటుంటే కాంట్రాక్టర్లు దానిని నీరుగారుస్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ...

ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకవడటంతో సంబంధిత కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా నాణ్యతా లోపం కలిగిన సరుకులను సరఫరా చేస్తున్నా సంబంధిత అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. చిన్న సైజువే కాక దుర్వాసన వస్తున్నాయని, కందిపప్పు పచ్చిగా ఉంటోందని వాపోతున్నారు. సాధారణంగా బహిరంగ మార్కెట్‌లో కోడి గుడ్డు బరువు 60 – 65 గ్రాములు ఉంటుంది. అంగన్‌వాడీ కేంద్రాలకు ఇచ్చే గుడ్లు 50 గ్రాములకు తగ్గొద్దనే నిబంధన ఉన్నా అలా ఉండడం లేదు. ఇక కేంద్రాలకు ప్రతీనెల సన్నబియ్యం, నూనె, బాలామృతం, కందిపప్పు, పోపుదినుసులు, కారం, పసుపు, జిలకర తదితర సరుకులు సరఫరా చేస్తుండగా పోపు దినుసులు నాసిరకంగా ఉన్నాయని చెబుతున్నారు.

30 గుడ్లు.. కేజీన్నర

కోడిగుడ్లను ఎలక్ట్రానిక్ కాంటా ద్వారా తూకం వేయకుండా ఒక్కో కేసులో ఒక్కో గుడ్డును చొప్పున 30 గుడ్లను ప్లాస్టిక్ క్యారీ బ్యాగులో వేసి తూకం వేస్తారు. ఇవి కేజీన్నర వస్తే నిర్దేశించిన పరిమాణం కలిగిన గుడ్లుగా భావిస్తారు. అంతకన్నా తక్కువ ఉంటే వెనక్కి పంపిస్తారు. అయితే చాలాచోట్ల లోపాలు ఎదురవుతున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇకనైనా ప్రతీ అంగన్‌వాడీ కేంద్రానికి ఎలక్ట్రానిక్ కాంటా సమకూర్చి బరువు పరిశీలించాలని పిల్లల తల్లిదండ్రులు, బాలింతలు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు..



అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యత లోపించిన సరకులను సరఫరా చేస్తే సంబంధిత కాంట్రాక్టర్‌పైన చర్యలు తీసుకుంటాం. కోడిగుడ్ల విషయంలో గానీ కందిపప్పు విషయంలో గానీ నిర్దేశించిన ప్రకారం తక్కువ పరిమాణంలో ఉంటే నోటీసులు జారీ చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మీప్రసన్న, సీడీపీఓ పాల్వంచ ప్రాజెక్ట్

పంట నష్టపరిహారం అందించాలి



ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జూలూరుపాడు: భారీవర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌ను కొత్తగూడెంలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా పంటలకు నష్టం జరిగిందని, అధికారులతో అంచనా వేయించి, రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. అదేవిధంగా జడలచింత, పడమటనర్సాపురం తుమ్మలవాగు, అన్నారుపాడు అలుగు వాగుపై ప్రస్తుతం లోలెవల్ బ్రిడ్జి, చప్టాలపై వరద ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని హైలెవల్ బ్రిడ్జిలు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జాటోత్ కృష్ణ, బానోత్ ధర్మా, సీవై పుల్లయ్య, కంకణాల అర్జున్‌రావు, లక్ష్మణరావు, బాబు, వీరభద్రం, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

టీచర్లు, ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

టేకులపల్లి: టేకులపల్లి మండలంలోని బేతంపూడి, తడికలపూడి, రామచంద్రునిపేట, కొప్పురాయి ప్రాథమిక పాఠశాలల్లో నూతనంగా ప్రీ ప్రైమరీ మంజూరైందని టేకులపల్లి మండల విద్యాశాఖాధికారి అజ్మీర జగన్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాఠశాలల్లో పని చేసేందుకు ప్రీ ప్రైమరీ టీచర్లు, ఆయా పోస్టులకు ఆసక్తి, అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. 7వ తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 44 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలని, విద్యార్హతలు, నివాస ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డుతో జిరాక్సులు దరఖాస్తుకు జత చేసి ఈనెల 30 వరకు టేకులపల్లి ఎంఈఓ కార్యాలయంలో అందజేయాలని కోరారు. మెరిట్ ప్రాతిపదికగా, తాత్కాలిక పద్ధతిన నియామకం చేపట్టడం జరుగుతుందని, ఒక విద్యా సంవత్సరంలో 10 నెలలకు మాత్రమే పారితోషికం చెల్లించబడుతుందని, నియమితులైన వీరిని ఎప్పుడైనా తొలగించుటకు జిల్లా విద్యాశాఖాధికారికి పూర్తి అధికారం ఉంటుందని తెలిపారు.

మౌలిక వసతులు కల్పించండి..



రోడ్డుపై బురదను చూపిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: మండలంలోని సీఎస్పీబస్తీ దేవులపల్లి యాకయ్యనగర్‌లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు మన్యం మోహన్‌రావు డిమాండ్ చేశారు. కాలనీలో సమస్యలపై స్థానికులతో కలిసి సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. మాట్లాడుతూ.. గ్రామంలో మురుగు కాల్వలు శుభ్రం చేయకపోవడంతో దోమలు ఉధృతమై ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ అధికారులు కాలనీవైపు కన్నెత్తి చూడకపోవడంతో సమస్యలు తాండవిస్తున్నాయని వాపోయారు. అధికారులు తక్షణం స్పందించి పారిశుద్ధ్యం మెరుగుపర్చాలని కోరారు. కార్యక్రమంలో వజ్జ సురేష్, వీరభద్రం, కోటమ్మ, నీలారాణి, సుజాత, పద్మ, పుల్లమ్మ, రెహానా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పాఠశాలల క్రీడలు

జూలూరుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు శుక్రవారం ముగిసాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో విజేత జట్లకు దాత మంగమూడి నాగేశ్వరరావు చేతులు మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. అంతకముందు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం, లక్ష్మీనర్సయ్య, పాపకొల్లు హైస్కూల్ హెచ్‌ఎం ఎస్కే మీరా సాహెబ్, పీడీలు అరుణకుమారి, యుగంధర్, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా సమస్యలపై చిత్తశుద్ధి లేదు..



పోరుబాట యాత్రలో నాయకులు, విద్యార్థులు

ఇల్లెందు: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధి లేకుండా పోయిందని పీడీఎస్‌యూ ఆరోపించింది. శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థి పోరుబాట యాత్ర ఇల్లెందుకు చేరుకుంది. విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. పట్టణంలోని హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, కళాశాలల్లో పర్యటించి విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలను సేకరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ మాట్లాడుతూ గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా విద్యాశాఖ మంత్రిని నియమించలేదన్నారు. గ్రామస్థాయిలో పాఠశాల నుంచి యూనివర్సిటీల వరకు విద్యారంగం తీవ్ర సంక్షోభంలో ఉందన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం సాగుతున్న విద్యార్థి పోరుబాట యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివప్రశాంత్, బి.సాయికుమార్, రామ్‌చరణ్, అబ్దుల్ ఘనీ, విష్ణువర్ధన్, జార్జ్, సంధ్య, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు



రక్తనమూనా సేకరిస్తున్న వైద్యసిబ్బంది

జూలూరుపాడు: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం పాపకొల్లు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రధాన మంత్రి టీబీ (క్షయవ్యాధి) ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టీబీ రోగులకు గుర్తించేందుకు ఎక్స్‌రే, రక్త పరీక్షలు చేశారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ టీబీ అనుమానితుల వ్యక్తులకు ఎక్స్ రే, రక్త పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా డెంగీ, టైఫాయిడ్, వైరల్ ఫీవర్స్‌కు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వాగొడ్డుతండా, మాచినేనిపేట, గోపాతండాలో డెంగీ కేసులు నమోదైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీటీసీ జిల్లా కోఆర్డినేటర్ శిరీష, సీహెచ్ఓ ఎం రామకృష్ణ, హెచ్ఎస్ రత్నకుమార్, టీబీ సూపర్‌వైజర్ రఫేల్, ఎక్స్ రే నిపుణులు విజయ్, ఎంఎల్‌హెచ్‌పీ జి.శ్రీనివాస్, ఐసీటీసీ ఎల్‌టీ బి.రాహుల్, సిబ్బంది శరత్, కుమార్, ఏఎన్ఎంలు తార, పార్వతి, ఆశాకార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

క్రీడలతో జీవితంలో ఉన్నతస్థాయి..



ఇల్లెందురూరల్: ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

కొత్తగూడెంఅర్బన్: శ్రీ రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడల దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఘనంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వనజ మాట్లాడుతూ ధ్యాన్‌చంద్ 1906లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అలహాబాద్‌లో ఆగస్టు 29న జన్మించారని, అతను చిన్ననాటి నుంచి హాకీ పట్ల మక్కువతో క్రీడారంగంలో రాణించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పూర్ణచందర్‌రావు, ఫిజికల్ డైరెక్టర్ బట్టు వెంకన్న, డాక్టర్ వెంకట్, మధు, ఎస్.సునీత, అనిత, అంజనీదేవి, అరుణ, శ్రీలత పాల్గొన్నారు.

ఇల్లెందు: క్రీడలు మానవ జీవితాన్ని మలుపు తిప్పుతాయని గాయత్రీ పరివార్ యుగ్ నిర్మాణ్ సంస్థ రాష్ట్ర ప్రచారక్ సతీష్ ఖండేల్‌వాల్ అన్నారు. శుక్రవారం ప్రపంచ క్రీడా దినోత్సవం సందర్భంగా ప్రైవేట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: అంతర్జాతీయ స్థాయిలో భారత జాతీయ క్రీడ హాకీకి కీర్తిప్రతిష్టలు తెచ్చిన ధ్యాన్‌చంద్ దేశ క్రీడా రత్నమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య అన్నారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చదువుతోపాటు క్రీడలపైనా ఆసక్తి చూపాలన్నారు.

ఆత్మగౌరవ సభకు మద్దతు

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో డిఫరెంట్ ఏబుల్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హబీబ్‌మియా, ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య సూచనలతో సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్న ఆత్మగౌరవ సభకు దివ్యాంగ, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని జిల్లా అధ్యక్షుడు మాలోత్ జగ్గుదాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ లక్ష్మా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ సంఘం తరఫున ఉద్యోగులు హాజరై సభను విజయవంతం చేస్తామని పేర్కొన్నారు.

సమస్యలపై జీఎంకు వినతి



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజుకు టీబీజీకేఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. సంఘం జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా కార్మికుల సమస్యల సాధనకు టీబీజీకేఎస్ యూనియన్ అగ్ర నాయకులు ఈనెల 28 నుంచి సెప్టెంబర్ 2 వరకు ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా ఈరోజు సింగరేణి వ్యాపిత జీఎం కార్యాలయల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టి జీఎంలకు వినతిప్రతాలు ఇవ్వాలని తెలిపారని, వారి ఆదేశాల మేరకు ఈరోజు వినతిపత్రాలు ఇవ్వటం జరిగిందన్నారు. స్పందించిన జీఎం అందజేస్తామని తెలిపారు. అదేవిధంగా సెప్టెంబర్ 2న సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట కోల్‌బెల్ట్ మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టటం జరిగిందని ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గడప రాజయ్య, మాదాసు ఈశ్వరరావు, గిన్నారపు మహేందర్ పాల్గొన్నారు.

‘రోడ్డెక్కిన డ్వాక్రా గ్రూపు’

- బ్యాంకు రుణానికి దరఖాస్తు
- లీడర్ తొలగింపుతో వివాదం

ఇల్లెందు: మెప్మాలో నిబంధనలు ఉల్లంఘించి డ్వాక్రా గ్రూప్ లీడర్‌ను తొలగించి అదే గ్రూపు పేరుతో బ్యాంకు రుణానికి దరఖాస్తు చేసుకున్నారు. సమాచారం అందుకున్న అంతకుముందున్న గ్రూపు లీడర్ బ్యాంకుకు వెళ్లి విషయం వివరించడంతో రుణం నిలిపివేశారు. ఈ విషయం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. ఇల్లెందు పట్టణంలోని 1వ వార్డు సత్యనారాయణపురంలో బాబా పేరుతో ద్వాక్రా గ్రూపు ఉంది. మదార్‌బీ లీడర్‌గా, ఖాజాబీ సెకండ్ లీడర్‌గా ఉన్నారు. వీరి మధ్య తలెత్తిన వివాదం చిలికిచిలికి గాలివానలా మారింది. ఈ గ్రూపులో తొమ్మిది మంది సభ్యులు ఒకే ఇంటికి చెందినవారు, సమీప బంధువులు కావటంతో వీరంతా ఏకమై లీడర్ మదార్‌బీని తొలగిస్తూ తీర్మానం చేసుకున్నారు. ఇందుకు మెప్మా సీసీ కూడా సహకరించింది. వెంటనే అదే గ్రూపు పేరుతో బ్యాంకుకు రుణానికి దరఖాస్తు చేశారు. రూ.15 లక్షలు మంజూరయింది. విషయం తెలిసిన మదార్‌బీ బ్యాంకుకు వెళ్లి అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో బ్యాంకు అధికారులు రుణం నిలిపివేశారు. దీంతో వీరి పంచాయతీ రోడ్డెక్కింది. సభ్యులంతా మదార్‌బీ లీడర్‌గా ఉన్న గ్రూపులో ఉండటం ఇష్టం లేక ఆమెను తొలిగించి కొత్త లీడర్, సెకండ్ లీడర్‌ను ఏర్పాటు చేసుకున్నారని మెప్మా సీసీ చెబుతుండగా, తన గ్రూపులో ఉండటం ఇష్టం లేకపోతే బయటకు వెళ్లిపోవచ్చని, తన గ్రూపులో పాత వారి స్థానంలో కొత్త వారిని చేర్చుకుంటానని మదార్‌బీ చెబుతోంది. తన సంతకాలను ఫోర్జరీ చేసి తానే గ్రూపు నుంచి తప్పుకుంటున్నట్లు సృష్టించారని ఆమె ఆరోపించింది. ఈ సంఘటనపై విచారణ జరిపించాలని, మంజూరైన రుణం నిలిపివేయాలని కోరింది. ఈ విషయమై టౌన్ మెప్మా కోఆర్డినేటర్ నాగయ్యను వివరణ కోరగా తన దృష్టికి వచ్చిందని, దీనిపై పూర్తిస్థాయి విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్‌గా కవీంద్ర

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్‌గా భూపాలపెల్లి ఎస్ఓటూ జీఎంగా విధులు నిర్వహిస్తున్న శీలం కవీంద్రను నియమిస్తూ యాజమాన్యం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ విధులు నిర్వహించిన పి.శ్రీనివాస్‌రావు ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో యాజమాన్యం కవీంద్రను నియమించింది. అదేవిధంగా కార్పొరేట్ ఐటీ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీగా హరప్రసాద్‌ను నియమిస్తూ శుక్రవారం యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది.

చలో హైదరాబాద్

ఇల్లెందు: 7న హైదరాబాద్‌లో జరగనున్న కాంట్రాక్ట్ కార్మికుల సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన వాల్‌పోస్టర్లను ఇఫ్టూ జాతీయ ఉపాధ్యక్షుడు సాధినేని వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. శుక్రవారం ఇల్లెందులోని ఇఫ్టూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాంట్రాక్ట్ కార్మికులు, ఔట్ సోర్సింగ్, స్కీం వర్కర్లు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కె.సారంగపాణి, రాసుద్దీన్, జే.సీతారామయ్య, డి.ప్రసాద్, కె.శ్రీనివాస్, మురళీ పాల్గొన్నారు.

రాజీవ్ గృహకల్ప ఇళ్ల పరిశీలన

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపాలిటీలోని 12వ వార్డులో 20 ఏళ్ల క్రితం నిర్మాణంలో నిలిచిపోయిన రాజీవ్ గృహకల్ప ఇళ్లు, నాలుగేళ్ల క్రితం చేపట్టిన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి పేదలకు పంపిణీ చేయాలని సీపీఎం బృందం కోరింది. శుక్రవారం నాయకులు వాటిని సందర్శించి పరిశీలించారు. నాయకులు ఎస్‌ఏ నబీ, ఆలేటి కిరణ్ మాట్లాడుతూ అసంపూర్తిగా వదిలేసిన ఇళ్లను పూర్తి చేసి పేదలకు గృహవసతి కల్పించాలని కోరారు. రాజీవ్ గృహకల్ప అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నారు. కృష్ణ, మోహన్‌రావు, మాదారపు వెంకటేశ్వర్లు, వజ్జా సురేష్, పవన్ పాల్గొన్నారు.

వలంటీర్లకు శిక్షణ

జూలూరుపాడు: పాపకొల్లు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం వలంటీర్లకు ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చేదిద్దే లక్ష్యంతో ఉల్లాస్ కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా పాపకొల్లు గ్రామ సమాఖ్య సభ్యులు శెట్టి వెంకటలక్ష్మి, సామ్రాజ్యం ఆధ్వర్యంలో వలంటీర్లకు ఉల్లాస్ కార్యక్రమంపై ఉపాధ్యాయుడు హలావత్ నరసింహారావు శిక్షణ ఇచ్చారు.

జీఎం గారు.. డిస్పెన్సరీపై దృష్టి పెట్టండి..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా కార్మిక ప్రాంతమైన రామవరంలోని డిస్పెన్సరీపై జీఎం దృష్టి సారించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. శుక్రవారం కొత్తగూడెంలోని శేషగిరిభవన్‌లో ఏర్పాటు చేసిన యూనియన్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. రామవరంలో గతంలో కార్మికులకు ఏ జబ్బు వచ్చినా రెసిడెన్షియల్ వైద్యులు, సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది రేయింబవళ్లు వైద్య సేవలందించేవారు. కానీ నేడు ఆ ఆస్పత్రి బంగ్లా భూత్ బంగ్లాగా మారిందని, పందులు, కోతులు, జంతువులు తిరుగుతున్నాయని కనీసం గేట్‌కు తాళం కూడ వేయలేని దుస్థితిలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి యాజమాన్యం కార్మికుల సంక్షేమం కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతూ ప్రచారం చేస్తూ నేడు కార్మికులు లేరనే సాకుతో రామవరంలోని ఆస్పత్రిని మూసివేయటం సరికాదని, కార్మికులు గతంలో కంటే తక్కువగా ఉన్నా, కార్మిక కుటుంబాలు, వేలాది మంది ఉన్నట్లు చెప్పారు. అదేవిధంగా రామవరంలో సుమారు 12 వేల మంది ప్రజలు నివాసముంటున్నారని సీఎస్సార్ పాలసీలో భాగంగా వైద్యసేవలందించాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ఆస్పత్రికి దీర్ఘకాలిక జబ్బులున్నవారికి మందులు పంపిణీ చేసే కేంద్రంగా మారిన ఈ సెంటర్‌కు వచ్చిన రోగులు వాష్‌రూమ్‌కు వెళ్దామంటే దుర్గంధం వస్తోందని, ఆస్పత్రిని ఆధునీకరించాలని కోరారు. వంగా వెంకట్, జి.వీరస్వామి, శ్రీనివాస్, బందరి మల్లయ్య పాల్గొన్నారు.